కథావేదిక

# ఛీ! పాడు

— శ్రీమోహనహరి

పెద్ద పెద్ద కళ్ళున్నవాడు. ఉంగరాల జుట్టున్నవాడు. తుంటరివాడు. పాతికేళ్ళ కుర్రవాడు. అస్తమానం నావెంట పడుతున్నాడు!!

నా గుండె గుబగుబలాడుతోంది.

శ్రీవారికి ప్రమోషన్ వచ్చింది. సికిందరాబాదుకి ట్రాన్స్‌ఫర్ అయ్యారు. సంగీత్ థియేటర్ దగ్గరున్న రైల్వే ఆఫీసర్స్ లాన్సర్స్ బ్యారెక్స్‌లో చక్కటి క్వార్టర్ దొరికిందని సంతోషిస్తున్న సమయంలో మధ్యలో ఈ బెడదొకటి.

సాధారణంగా లాన్సర్స్ క్వార్టర్‌లోని లేడీస్ అంతా కలిసి ఈవినింగ్ టైములో వాకింగ్ వెళ్తూ మోండా మార్కెట్లో షాపింగ్ చేస్తుంటారు. వాళ్ళతో కలిసి వెళ్తున్నాను.

నేను గోంగూర బేరమాడుతున్నప్పుడు అప్రయత్నంగా అతనివైపు చూశాను. అదోలాంటి చూపు. చీర కొంగుని సవరించుకున్నాను.

తిరిగి వస్తున్నప్పుడు మళ్ళీ సంగీత్ థియేటర్ దగ్గర హీరోహోండా మీద కూర్చుని నావైపే చూస్తున్నట్టు గమనించాను. ఈసారి పూర్తిగా భయపడిపోయాను.

పాతికేళ్ళ యువకుడు నాలాంటి ముప్ఫై ఆరేళ్ళ గృహిణి వెంట పడుతున్నాడంటే దానికి అర్థం ఏమిటి?! చిరాగ్గా ముఖం పెట్టి తలొంచుకుని ఇంటికి వచ్చేశాను. అలా వరుసగా పదిరోజుల నుంచీ నా వెంట పడుతున్నాడు. సాధ్యమైనంత వరకు ఒంటరిగా ఉండకుండా ప్రయత్నిస్తున్నాను.

పోనీ, తోటి వాళ్ళతో చెబితే? హమ్మో!! ఇంకేమైనా ఉందా? ఆనోటా ఈనోటా కాలనీ అంతా వ్యాపించిపోతుంది. వాడి సంగతి వదిలేసి నామీదే లేనిపోనివి చెప్పుకుంటూ నవ్వుకుంటారు. అందుకే గమ్మున ఉండిపోయాను. శ్రీవారు వచ్చాక మనసు కాస్త కుదుటపడింది. ఆయన బ్రీఫ్‌కేస్‌ని అందుకున్నాను. టిఫిన్‌బాక్స్ తియ్యాలని తెరిస్తే అందులో ఫెర్‌ఫ్యూమ్ బాటిల్ గోద్రేజ్ హెయిర్‌డై ప్యాకెట్ కనిపించాయి.

ఆశ్చర్యంతో 'ఇవెందుకూ?..' అని అడిగాను.

''డార్లింగ్! నేనిప్పుడు ఆఫీసర్ని. నాకంటే పెద్దపెద్ద ఆఫీసర్లతో కలిసిపనిచేయాలి. కాస్త నీట్‌గా ఉండాలి కదా. గ్రే హెయిర్స్‌తో చెమటగబ్బుతో ఉండకూడదు. ఏమంటావ్?'' అన్నారాయన.

నవ్వొచ్చింది. నవ్వేశాను. నా నవ్వులో ఆయన నవ్వు కలిసిపోయింది. కానీ, ఆయన నవ్విన నవ్వు వల్ల ఇబ్బందిలో పడతానని నేనప్పట్లో అనుకోలేదు!!

ఆ మరుసటిరోజు బట్టలు ఆరేస్తూ ఉంటే కనిపించాడతను. క్వార్టర్స్ మెయిన్‌గేటు దగ్గరున్న కిళ్ళీకొట్టు ముందు సిగరెట్ కాలుస్తూ నావైపే చూస్తున్నాడు.

గుండె వేగంగా కొట్టుకోవడం మొదలెట్టింది. చటుక్కున లోపలికి వచ్చేశాను. అతనెందుకిలా వెంటపడుతున్నాడు? అతనికేం కావాలి? పొద్దస్తమానం నావెంట పడుతున్నాడు. భయంతో తట్టుకోలేక ఆయన్తో చెప్పేశాను.

''ఎవడో నా వెంట పడుతున్నాడండీ.'' అని.

ఆయన నవ్వారు. ''ఇందులో ఆశ్చర్యమేముంది, డార్లింగ్! దబ్బపండులాంటి మెరిసిపోతున్న నీ ఒళ్ళు. అజంతా శిల్పంలా పుష్టికరమైన నీ అవయవ సొంపులు. నీలాంటి బ్యూటీక్వీన్‌తో శృంగార శయ్య ఏమగాడికైనా మక్కువేకదా?''

''ఛీ! పాడు. ఏమిటా మాటలు. నాబాధ నాకుంటే మీకు తమాషాగా ఉందా? బయటకు వెళ్ళాలంటే భయమేస్తోంది.'' అన్నాను కోపంతో.

ఆయన మౌనం వహించారు. ''ఎవడు వాడు?''

''ఎవడో పిచ్చివెధవ. వాణ్ణి ఎక్కడో చూసినట్లు గుర్తు.'' అన్నాను.

''నో ప్రాబ్లమ్. ఇలాంటి రోడ్‌సైడ్ రోమియోలు వెంట పడతారుగానీ వాళ్ళకి ధైర్యం ఉండదు...''

''ఒకవేళ వాడు ఇంట్లోకి దూరితే...''


''వస్తేరానీ. నువ్వేం భయపడకు. నవ్వుతూ ఆహ్వానించు. టీ ఆఫర్ చేయ్. ఆ తర్వాత పక్కింటి వాళ్ళని పిలిచి పోలీసులకు హాండ్ ఓవర్ చేయ్. ఆ తర్వాత నేను చూసుకుంటాను.''

ఆయన మాటలు నా మనసుని కుదటపర్చలేదు. ఆయన చెప్పినంత ఈజీ విషయమా ఇది? సరాసరి ఇంట్లోకి దూరి ఏమత్తు మందు వాసన చూపించి అఘాయిత్యం చేస్తే నేనేం చెయ్యనూ? అయినా ధైర్యం చేయక తప్పదు.

ఆదివారం– ఆయన ఆఫీసుకెళ్ళిపోయారు. మిగతా క్వార్టర్స్‌లో 'శ్రీకృష్ణ' టీవీ సీరియల్ చూస్తున్నారు. అంతా సందడి... సడన్‌గా కాలింగ్ బెల్ మ్రోగింది. ఐ గ్లాస్ నుంచి చూశాను. వాడే!!!

గుండె దడదడ కొట్టుకోసాగింది. ఒళ్ళంతా వణుకుపుడుతోంది. ఏం చెయ్యాలో తెలీని అయోమయం.

డోర్ బెల్ మళ్ళీ మ్రోగింది. తెగించాను. విసురుగా తలుపులు తెరిచాను. వాడు చేతులు జోడించి నమస్కారం పెట్టాడు. ప్రతి నమస్కారం పెట్టాను.




''అక్కయ్యగారూ! మీతో ముఖ్యమైన విషయం చెప్పాలని ఎన్నో రోజుల నుంచీ ప్రయత్నిస్తున్నాను. మీరందుకు అవకాశమే ఇవ్వడంలేదు. నన్ను చూసి భయపడుతున్నారు. అందుకే తప్పనిసరిగా సరాసరి మీ ఇంటికి వచ్చేశాను.'' అన్నాడతను.

అతని సంబోధన నన్ను ఆశ్చర్యచకితురాలిగా చేసింది. అయినా ''నాతో నీకేం పని?'' అన్నాను కటువుగా.

"ఇలాంటి వాళ్ళు ముందు పవిత్రమైన వరుసలు కలుపుకుని ఆ తర్వాత అసలు రంగు బయటపెడతారు. ఈరోజుల్లో ఏ మగవాళ్ళని నమ్మకూడదు." అని మనసులో అనుకున్నాను.

"నేను లోపలికి రావచ్చా? నావలన మీకు ఎలాంటి హాని కల్గదు. అస్సలూ, మీరు నన్ను గుర్తుపట్టలేదు. నాపేరు శ్రీనివాస్. ఆర్నెళ్ళ క్రితం కాజీపేటలో మేరుగ విజయ్‌కుమార్‌గారి అమ్మాయి పెళ్ళిలో కలుసుకున్నాం. వరుసకి మీరు నాకు అక్కయ్య అవుతారు. చాలా దగ్గరి బంధుత్వం." అంటూ అతని కుటుంబ సభ్యుల గురించి చెబుతుంటే అప్పుడు గుర్తుకొచ్చింది- నిజమే! అతడ్ని ఆరోజు చూశాను. అయినా అనుమానంగానే ఉంది. దగ్గరి బంధువైతే ఇలా దొంగలా ఫాలో ఎందుకవుతున్నాడు!? ఆలోచిస్తూ అప్రయత్నంగా అతణ్ణి లోపలికి ఆహ్వానించాను. అతడు సోఫాలోకొచ్చి కూర్చున్నాడు. "ఇప్పుడు చెప్పు. ఏమిటి సంగతి?" అన్నాను. అతని మొహం వెంటనే ఎర్రబడిపోయింది.



"ఈ విషయం మీతో చెబుతున్నందుకు సిగ్గుపడుతున్నాను." అంటూ ఆగిపోయాడతను. నాలో టెన్షన్ పెరిగిపోతోంది. అసహనంగా అతనికేసి చూశాను.

"నా స్థానంలో మరొకరుంటే ఈపాటికి బాడీలోని ఏ పార్టుకి ఆ పార్టు విరగ్గొట్టి గాంధీ హాస్పిటల్‌కి పంపించేవారు..." నేను సహనం కోల్పోయాను.

"అసలేమైంది?!" అన్నాను.

"అక్కయ్యగారూ! నా చెల్లెలు హరిత ఈ మధ్యనే స్టెనోగా సెలెక్ట్ అయింది. ఇప్పుడది ప్రొబేషన్ పీరియడ్‌లో ఉంది. చెప్పుకుంటే సిగ్గుపోద్ది. కూతురులాంటి అమ్మాయి ఒంటి మీద చేతులు వేయడం, డ్యూటీకాని సమయంలో డ్యూటీకి రమ్మని ఆజ్ఞాపిస్తూ ఆ తర్వాత నీజడ బాగుంది. నీ బుగ్గలు బాగున్నాయి. నీ నడుం సన్నసన్నగా ఉందని ఎబ్బెట్టుగా వర్ణిస్తుంటే పెళ్ళికాని అమ్మాయి ఎంత నరకయాతన పడుతుందో మీకు చెప్పఖ్ఖర్లేదనుకుంటా. అదొచ్చి నాదగ్గర చెప్పుకుని కన్నీళ్ళు పెట్టుకోని రోజంటూ లేదు. ఏం చెయ్యాలో మీరే చెప్పండి..." మాటలాపేసి అతను నా కళ్ళల్లోకి సూటిగా చూశాడు. నాకు కాస్త అర్థమౌతూంది. అయినా నమ్మలేకపోతున్నాను.

"ఇంతకీ నువ్వెవరిగురించి చెప్పేది?" అన్నాను కాస్తంత తగ్గు స్థాయిలో.

"ఇంకెవరు? బావగారే!! నేను మళ్ళీ మళ్ళీ చెబుతున్నాను. నేను తలుచుకుంటే బావగారికి బుద్ధి చెప్పడం ఏమంత కష్టంకాదు. పొట్ట చింపుకుంటే పేగులు బయటపడతాయి. అందుకే మీ ముఖం చూసి పూరుకుంటున్నాను. దీనికి పరిష్కారం మీ చేతుల్లో ఉంది.

మీ భర్తని మీరెట్లా దారికి తెచ్చుకుంటారో నాకు తెలీదు. ఇక ముందు ముందు ఇట్లాగే ప్రవర్తిస్తే మాత్రం అందుకు పర్యవసానం ఏమవుతుందో మీకు తెలుసు, అంతే." అతడు లేచి విసురుగా వెళ్ళిపోయాడు. నేనట్లాగే నిల్చుండిపోయాను. ఒక రచయిత చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. "తుమ్మెదలాంటి మొగుడ్ని కొంగుని కట్టుకోవాలంటే పువ్వులాంటి భార్య ఎన్నెన్ని అగచాట్లు పడాలో-" అని. మనసు పాడైపోయింది. అవమాన భారంతో ఒళ్ళంతా భగభగ మండుతోంది. "ఛీ! పాడు" అని గుండె గోల చేయసాగింది.

ఒక స్త్రీ సరస్వతిలా విద్యనిస్తోంది. ఒక స్త్రీ ధనలక్ష్మిలా కనకవర్షం కురిపిస్తోంది. ఒక స్త్రీ పార్వతిలా మగాడికి శక్తినిస్తోంది. చివరికి- ఒక స్త్రీ తల్లిలా మగాడికి జన్మనిస్తోంది. నేనూ ఒక స్త్రీనే!! నేనెవరిలా అవ్వాలి?

అడ్డదార్లు తొక్కే భర్తని అదుపులో పెట్టుకోవాలంటే ఏరూపం దాల్చాలి? ఆరూపంలో భర్తని దారిలోకి తెచ్చుకోవాలి. సంసారాన్ని కాపాడుకోవాలి. ఆరూపంలోనే ఆయన కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాను. నేనిప్పుడు ఏరూపంలో ఉన్నానో మీకు తెలుసు. ఔనా?

★